
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.8 : కనిష్ఠం 24.5

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 11 ఆగస్టు 2024



● ఇటీవల జైనథ్ మండలం కామాయి వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ రేషన్ బియ్యం

● ఇటీవల రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడిన వ్యాపారులు







దొడ్డు బియ్యం.. దొంగలు!

- జిల్లాలో రోజురోజుకూ రెచ్చిపోతున్న రేషన్ బియ్యం దొంగలు
- యథేచ్ఛగా మహారాష్ట్రకు తరలిస్తూ.. సొమ్ము చేసుకుంటున్న వైనం
- తనిఖీల్లో తరచూ పట్టుబడుతున్న రేషన్ బియ్యం
- ఇంద్రవెల్లి మండల కేంద్రంగా సాగుతున్న అక్రమ దందా
- సరిహద్దు చెక్ పోస్టుల వద్ద కొరవడిన నిఘా
- పత్తాలేని సంబంధిత సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 25 కేసులు నమోదు కాగా.. 1500 క్వింటాళ్లకు పైగా పట్టుబడిన రేషన్ బియ్యం

ఆదిలాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దొడ్డు బియ్యం (రేషన్‌బియ్యం) దొంగలు మరింత రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా మహారాష్ట్రకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాల్లో తమ ప్రతినిధుల ద్వారా రేషన్ బియ్యాన్ని సేకరించి పెద్దమొత్తంలో సరిహద్దులు దాటిస్తున్నారు. ఈయేడాది జనవరి నుంచి ఆగస్టు 9వరకు జిల్లావ్యాప్తంగా 25 కేసులు నమోదు కాగా.. దాదాపుగా 1500 క్వింటాళ్లకు పైగా రేషన్ బియ్యం అధికారుల తనిఖీల్లో పట్టుబడింది. కొందరు లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని తినేందుకు ఇష్టపడకుండా అమ్మేసుకుంటున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రాయితీ బియ్యాన్ని తీసుకోవడం.. దళారులకు అమ్మేసుకోవడం పరిపాటిగానే మారింది. జిల్లాలో సేకరించిన రేషన్ బియ్యాన్ని సరిహద్దు మండలాలైనా తలమడుగు, బోథ్, తాంసి, బేల, జైనథ్, నార్నూర్ మండలాల మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. మహారాష్ట్రలోని బోరి, కిన్వట్, నాగ్‌పూర్, పాండ్రకవడ, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. తాజాగా ఇంద్రవెల్లి మండలంలో భారీగా అక్రమ బియ్యం పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది. అయితే పోలీసుల తనిఖీల్లోనే అక్రమ బియ్యం పట్టుబడుతున్నాయి. సివిల్ సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తప్పించుకుంటున్న అసలు సూత్రధారి

జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతున్నా.. అసలు సూత్రధారి తప్పించుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులు అమాయకులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారే తప్ప.. కఠినంగా వ్యవహరించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. అసలు ఈ అక్రమ దందా వెనక ఉన్నది ఎవరన్నది గుర్తించకలేక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలోని ఇంద్రవెల్లి మండలకేంద్రంగా గత కొన్నాళ్లుగా రేషన్ బియ్యం అక్రమ దందా సాగుతున్నా.. అధికారులు అడ్డుకట్ట వేయలేక పోవడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన ఓ జిన్నింగ్ వ్యాపారి పెద్ద ఎత్తున రేషన్ బియ్యం అక్రమ దందాకు ఎగబడినట్లు తెలుస్తుంది. తమ ప్రతినిధుల ద్వారా గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి మహారాష్ట్రతో పాటు తదితర ప్రాంతాలకు తరలించి లక్షల రూపాయలు వెనుకేసుకుంటున్నట్లు తెలిసింది. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. నెలనెలా మామూళ్లు ఇవ్వడంతోనే ఆ వ్యాపారి గోదాంల వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదంటున్నారు. అడపాదడప రేషన్ బియ్యాన్ని తరలించే ఆటోలను సీజ్ చేయడం, కేసులు నమోదు చేస్తూ చేతులు దులుపుకోవడం అధికారులకు అలవాటుగా మారిందంటున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు ఇంద్రవెల్లి మండలంలో సాగుతున్న అక్రమ దందాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే రేషన్ బియ్యం దందాకు అడ్డుకట్టపడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసలు సూత్రధారులను తప్పించి అమాయక డ్రైవర్లు, ఏజెంట్లను పట్టుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది.

మహారాష్ట్రలో భారీ డిమాండ్

జిల్లాలో దళారులు సేకరిస్తున్న రేషన్ బియ్యానికి మహారాష్ట్రలో భారీగా డిమాండ్ ఉంది. జిల్లాలో కిలో రేషన్ బియ్యం రూ.10 నుంచి రూ.15లు పెట్టి సేకరిస్తున్న వ్యాపారులు.. పెద్ద మొత్తంలో మహారాష్ట్రకు తరలిస్తూ కిలో రూ.18 నుంచి రూ.25 వరకు అమ్మేసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇలా కిలో రేషన్ బియ్యం వెంట రూ.3 నుంచి రూ.10 వరకు లాభం వస్తున్నట్లు తెలుస్తుంది. అంటే క్వింటాలు బియ్యానికి రూ.300 నుంచి రూ.వెయ్యి వరకు సంపాదిస్తున్నారు. కొందరు వ్యాపారులు దీనినే ఉపాధిగా మల్చుకుని పని చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇలా ఒక్కో లోడుకు లక్షల రూపాయలు జేబులో వేసుకుంటు న్నారు. మహారాష్ట్ర దళారులతో కుమ్మక్కై దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. రేషన్ బియ్యంతో పాటు అడ్డదారుల్లో పత్తి, పప్పుదినుసులు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అలాగే గంజాయి, తదితర వస్తువుల రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. మహారాష్ట్ర నుంచి దేశీదారు మద్యం, గుట్కాను దిగుమతి చేసుకుంటూ జిల్లా నుంచి రేషన్ బియ్యం, గంజాయిని సరఫరా చేస్తూ.. పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్నారు.

తనిఖీ కేంద్రాల్లో నిఘా కరువు

జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాల్లో నిఘా కరువవుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అధికారులకు అన్ని తెలిసే అక్రమదందాలు సాగుతున్నట్లు సమాచారం. చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించేందుకు కొందరు అధికారులు పోటీ పడుతున్నారంటే జిల్లా సరిహద్దుల్లో ఏ మేరకు అక్రమ దందాలు సాగుతున్నాయో ఇట్టే తెలుస్తూనే ఉంది. ఏళ్ల తరబడి చెక్‌పోస్టు సిబ్బంది ఒకేచోట విధులు నిర్వహించడంతో స్మగ్లర్లతో సత్సంబంధాలు ఏర్పడుతున్నాయి. బేల మండలంలో సాంగిడి, కంగార్‌పూర్, మార్లగుడ, కొబ్బాయి గ్రామాల నుంచి మహారాష్ట్రకు రాకపోకలు కొనసాగుతున్నాయి. కానీ ఈ మండల పరిధిలో ఎక్కడా తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. అలాగే భీంపూర్ మండలంలో కరంజి(టి) గ్రామం నుంచి మహారాష్ట్రకు రాకపోకలు సాగుతున్నా.. ఇక్కడ కూడా చెక్‌పోస్టును ఏర్పాటు చేయలేదు. బోథ్ మండలంలో ఘన్‌పూర్ గ్రామం వద్ద తనిఖీ కేంద్రా న్ని ఏర్పాటు చేసినా.. నామమాత్రంగానే తనిఖీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా మామూళ్లను చెల్లించడం అధికం కావడంతో కొందరు వ్యాపారులు తెలివిగా అడ్డదారుల్లో అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. తలమడుగు మండలంలో లక్ష్మీపూర్ గ్రామం వద్ద తనిఖీ కేంద్రం ఉన్నా.. ఇక్కడంతా ప్రైవేటు సిబ్బందే పెత్తనం చెలాయిస్తున్నారు. దీంతో అక్రమ దందా వ్యాపారులకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక బృందాలతో తనిఖీలు

: కిరణ్‌కుమార్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, ఆదిలాబాద్

జిల్లాలో జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ దందాపై ప్రత్యేక బృందాలు నిఘా సారిస్తున్నాయి. నిరంతరంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. మహారాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘాను సారిస్తున్నాం. లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని విక్రయించినట్లు తేలితే రేషన్ కార్డులను కూడా రద్దు చేస్తాం. ఇటీవలే రేషన్ బియ్యం దందా కొంత వెలుగులోకి వస్తోంది. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యాపారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

సంక్షిప్త సమాచారం



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జైసింగ్ రాథోడ్

వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 10: రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ కలిశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మంత్రిని కలిసి రిమ్స్‌కు సంబంధించిన పలు సమస్యలపై డైరెక్టర్ వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ట్రిమ్స్ అభివృద్ధిపై చర్చించారు. డైరెక్టర్ వెంట డాక్టర్ తిప్ప స్వామి, ఇద్రిస్ అక్బని తెలిపారు.

రేపటిలోగా డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించాలి : ప్రిన్సిపాల్

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 10: డిగ్రీ 6వ సెమిస్టర్‌లో ఒక సబ్జెక్ట్ తప్పిన వారికి పరీక్ష రాసే అవకాశాన్ని కాకతీయ యూనివర్సిటీ కల్పించిందని ఆదిలాబాద్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అతీఖ్‌బేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీసీల జనగణన చేసి ఎన్నికలు త్వరగా జరపాలి

ఉట్నూర్, ఆగస్టు 10: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల లోని స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నాయిక పోడ్ సేవా సంఘం రాష్ట్ర నాయకులు, ఉట్నూర్ మాజీ సర్పంచ్ బొంత ఆశారెడ్డి డిమాండ్ చేశారు. గన్నవరం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్పంచ్‌ల పదవి కాలం ముగిసి ఆరు నెలలు గడిచాయని, గ్రామాలకు ప్రత్యేక అధికారుల పాలన రావడంతో గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగడం లేదని అన్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో నీటి ఎద్దడి!

- పలు గిరిజన గ్రామాలకు రాని మిషన్ భగీరథ పథకం నీళ్లు
- ఏళ్లు గడుస్తున్నా.. బొజ్జుగూడ గ్రామంలో ఒకటే చేతి పంపు
- ప్రభుత్వ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్

నార్నూర్, ఆగస్టు 10: జిల్లాలోని ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో వర్షాకాలం సీజన్‌లో కూడా నీటి ఎద్దడి మొదలైంది. దీనిలో భాగంగా గాదిగూడ మండలం రుప్పాపూర్ గ్రామ పంచాయతీ బొజ్జుగూడ గ్రామం 40 కుటుంబాలు 200లకు పైగా జనాలు తాగడానికి అవసరాలకు నీరు లేక ఆదివాసీలు అల్లాడిపోతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి స్థానిక ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఒక్కటే చేతిపంపు ఉంది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ పథకం నీళ్ల కూడా రావడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

● **నీటి కోసం అరకిలో మీటర్ల మేర నడక**

ఉదయంలేవగానే గుక్కెడు తాగునీటి కోసం గ్రామ శివారులోని గిరిజనులు కష్టాలు పడుతున్నారు. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా మంచి నీటి కోసం కిలోమీటర్ మేర కాలినడకన వెళ్లడం గమనార్హం. వర్షాకాలంలోనే ఈ పరిస్థితి ఇలా ఉంటే.. రాబోయే రోజుల్లో ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ పరిస్థితి అర్థం చేసుకుని నీటిసమస్యను పరిష్కరించాలని పలువురు గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. లేనియెడల ఇక తామంతా రోడ్డుపై కూర్చుని నిరసన ధర్నా కార్యక్రమాలు చేపడతామని గ్రామస్థులు పేర్కొన్నారు.



చేతిపంపు నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు

ప్రహరీ లేని పాఠశాల.. బాలికల ఇక్కట్లు



బోథ్‌లో ప్రహరీ గోడ లేని ప్రభుత్వ బాలికల పాఠశాల

బోథ్, ఆగస్టు 10: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అరకొర వసతుల మధ్య చదువులు సాగుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు సరిపడా గదులు లేకపోవడంతో ఉపాధ్యాయులు తప్పనిసరి పరిస్థితుల్లో విద్యా భవన్‌లో కొనసాగించాల్సి వస్తుంది. మరోవైపు పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో.. ఆ పాఠశాలలో చదివే బాలికలకు ఇబ్బందికరంగా మారింది. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ.. జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. అయితే ప్రహరీ లేకపోవడం వల్ల తరచుగా పశువులు వస్తుండటంతో మొక్కలను సైతం నాటించడం కష్టంగా మారిందని, ఉపాధ్యాయులు అంటున్నారు. బాలికలు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.



పతకాలు సాధించిన గిరిజన విద్యార్థులతో ఎమ్మెల్యే బొజ్జు

గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలి : ఎమ్మెల్యే

ఉట్నూర్, ఆగస్టు 10: ఉమ్మడి జిల్లాలోని గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయిలో జరిగే పోటీలలో కూడా రాణించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, ఫిజికల్ డైరెక్టర్ జాదవ్ హేమంత్ నాయక్‌ల ఆధ్వర్యంలో గత ఆరు, ఏడు తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలలో ఉట్నూర్‌లోని గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాల విద్యార్థులు 6 పతకాలు సాధించారని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన పెందూరు సతీష్, పెందూరు నగేష్, విక్రమ్, మేస్రం ఇంద్రజాన్‌లను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు సునంద్, శివకుమార్‌లు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఎస్సైల బదిలీలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 10: బాసర జోన్ పరిధిలో ఎస్సైలను బదిలీలు చేస్తూ బాసర జోన్-2 ఐజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో పలువురు ఎస్సైలకు స్థానచలనం కలిగింది. కుంటాల ఎస్సై రజినీకాంత్ బదిలీ కాగా, ఆయన స్థానంలో భాస్కర్ చారి, బోథ్ ఎస్సై రాము బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రవీణ్, బజార్‌హత్నూర్ ఎస్సై నరేష్ స్థానంలో అప్పారావు నియమితులయ్యారు. కాగా, భైంసా టౌన్ ఎస్సై మహమ్మద్ షరీఫ్ నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు.

మాజీ మంత్రి రామన్నకు పరామర్శ

జైనథ్, ఆగస్టు 10: మాజీ మంత్రి జోగు రామన్న పెద్ద అన్న జోగు పోతారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మండలంలోని దీపాయిగూడ గ్రామంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి శనివారం దీపాయిగూడ గ్రామానికి చేరుకుని జోగు రామన్నను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా జోగు పోతారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుమ్రంనీలాబాయి, నాయకురాలు సర్పే సోంబాయిలతో పాటు దీపాయిగూడ గ్రామ ప్రజలున్నారు.

మొక్కలు నాటాలి.. భవిష్యత్తు తరాలను కాపాడాలి

● **సనాతన ధర్మ సేవా సమితి బృందం**

ఇచ్చోడ, ఆగస్టు 10: భవిష్యత్తు తరాలు బాగు కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని సనాతన ధర్మ సేవా సమితి సభ్యులు అన్నారు. ఇష్టారాజ్యంగా చెట్లను నరికివేయడంతో పర్యావరణం దెబ్బతింటోందని, మానవ మనుగడతో ముడిపడి ఉన్న వృక్షాలను కాపాడుకోవడం సామాజిక బాధ్యత అనిఅన్నారు. శనివారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ కూడలి వద్ద నాలుగు వేల మొక్కలను పంపిణీ చేశారు. సనాతన ధర్మ సేవసమితి ఆధ్వర్యంలో గురువర్యులు సంత్ నారాయణ మహరాజ్ గారి నేతృత్వంలో శ్రీరామ చరిత్ మానస్ హనుమాన్ చాలీసా రచించి రామ మహత్యాన్ని మానవళికి తెలిపిన గోస్వామి తులసీదాస్ గారి జయంతి నిమిత్తం ఆదివారం ఇచ్చోడలోని అయ్యప్ప ఆలయంలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమితి సభ్యులు పేర్కొన్నారు. అయ్యప్ప ఆలయం నుంచి సమితి సభ్యులతో కలిసి ఆసుపత్రి, పోలీస్ స్టేషన్, గ్రామ పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పాఠశాల ప్రాంగణం, శ్మశాన వాటికలలో వనమహోత్సవ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం మొక్కల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మసేవా సమితి సభ్యులు గిత్తే నాందేవ్, పస్పట్టే సురేష్, శ్రీనివాస్, మౌళి, మోహన్, రవి, పలువురు సామాజిక సేవా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



సనాతన సేవాసమితి ఆధ్వర్యంలో మొక్కల విశిష్టతను తెలియజేస్తున్న చిన్నారులు

బంగారు వ్యాపారుల మధ్య పంచాయితీ!

బోథ్, ఆగస్టు 10 : మండల కేంద్రానికి చెందిన కొంత మంది వ్యక్తులు నిజామాబాద్ జిల్లా నుంచి ఓ వ్యక్తి తీసుకువచ్చిన బంగారాన్ని గుట్టుచప్పుడు కాకుండా తక్కువ ధరలో కొనుగోలు చేశారు. అయితే బహిరంగ మార్కెట్‌లో దొరికే తులం బంగారం కన్నా రూ.15 వేలు తక్కువ ధరకు దొరకడంతో కొంత మంది భారీగా కొనుగోలు చేశారు. నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ వ్యాపారంలో స్థానిక గోల్డ్‌స్మిత్‌లతో పాటు ఉద్యోగులు సైతం కొనుగోలు చేసినట్లు తెలిసింది. అయితే కొనుగోలుదారులంతా తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించడంతో పాటు వారి వద్ద నిలువ ఉంచుకున్నారని పలువురు పేర్కొంటున్నారు. అయితే దశలవారిగా బంగారం కొనుగోలు చేస్తుండడంతో మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి దాదాపు రెండు కోట్ల రూపాయల వరకు బంగారం ఇస్తానని చెప్పి డబ్బులు తీసుకున్నట్లు తెలిసింది. వ్యాపారానికి బంగారం విక్రయించే వ్యక్తికి మధ్యన మరోవ్యక్తి ఉండటంతో ఈ వ్యాపారం వ్యవహారం బయటకు పొక్కింది. డబ్బులు తీసుకున్న బంగారు విక్రయిదారు ఎన్నిసార్లు అడిగినా తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడంతో పంచాయతీ అయింది. దీంతో శుక్రవారం రాత్రి స్థానిక వ్యాపారుల సమక్షంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యాపారిని పిలిపించి ఈ విషయమై అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఈ విషయం బయటకు రావడంతో మండల కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యాపారం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు, బంగారం నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

యువకుడి మృతి

భోథ్ , ఆగస్టు 10 : బోథ్ మండల కేంద్రానికి చెందిన గాండ్ల రాజు (42) అనే యువకుడు రెండురోజుల క్రితం పురుగుల మందు సేవించాడు. వెంటనే బోథ్ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. శనివారం శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ బి.రాము తెలిపారు. మృతునికి తీవ్రమైన మూత్రపిండాల వ్యాధి ఉండటంతో మనస్థాపానికి గురై పురుగుల మందు సేవించాడని ఫిర్యాదులో పేర్కొనడం జరిగిందన్నారు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో విధుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్

- ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన
- ఫార్మాసిస్ట్ సహా స్టాఫ్‌నర్స్‌పై సస్పెన్షన్ వేటు
- సూపరింటెండెంట్ సహా ఐదుగురికి మెమోల జారీ
- ఆసుపత్రి విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరిక

ఖానాపూర్, ఆగస్టు 10 : ఆరోగ్యం కోసం వస్తే అనారోగ్యం పాలు అవ్వాల్సిన పరిస్థితి కల్పించిన ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిపై జిల్లా అధికార యంత్రాంగం కొరడా ఝుళిపించింది. 'కాలం చెల్లిన సెలైన్‌తో రోగికి చికిత్స' అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ స్పందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన అజారుద్దీన్ అనే యువకుడు తీవ్ర జ్వరంతో ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో అజారుద్దీన్‌ను పరీక్షించిన వైద్యులు అతనికి సెలైన్ బాటిల్ ఎక్కించాల్సిందిగా సిబ్బందికి సూచించారు. దీంతో అజారుద్దీన్‌కు జనరల్ వార్డులో బెడ్ కేటాయించిన సిబ్బంది అతనికి పారాసెటమోల్ అనే సెలైన్ బాటిల్‌ను ఎక్కించారు. సెలైన్ బాటిల్ ఎక్కించి అక్కడి నుంచి సిబ్బంది వెళ్లిపోయారు. ఆ తర్వాత స్వల్ప అస్వస్థతకు గురైనట్లు అనిపిస్తున్నట్లు అజారుద్దీన్ తెలపడంతో బాటిల్‌ను పరిశీలించిన అతని తమ్ముడు ఆసిఫ్ ఒక్కసారిగా అవాక్కయాడు. ఆ పారాసెటమోల్ సెలైన్ బాటిల్ ఈ ఏడాది మార్చి నెలలోనే కాలపరిమితి ముగిసినట్లు ఉండడంతో ఆసిఫ్ ఆందోళన చెందాడు. హుటాహుటిన ఆసుపత్రి సిబ్బందికి తెలపడంతో వచ్చి



అస్వస్థతకు గురైన అజారుద్దీన్ (ఫైల్)

అజారుద్దీన్‌కు ఎక్కించిన కాలం చెల్లిన సెలైన్ బాటిల్‌ను ఆసుపత్రి సిబ్బంది తీసేశారు. కాలం చెల్లిన సెలైన్ బాటిల్‌ను తమ సోదరుడికి ఎక్కించడం పట్ల ఆసిఫ్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనారోగ్యం బారిన పడి ఆరోగ్యం కోసం వచ్చిన తనకు కాలం చెల్లిన సెలైన్ బాటిల్ ఎక్కించి మరింత అనారోగ్యం పాలు చేస్తారా అంటూ అజారుద్దీన్ సైతం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిపై మండిపడ్డారు. ఈ విషయం ఆంధ్రజ్యోతి మెయిన్‌లో కాలం చెల్లిన 'సెలైన్‌తో రోగికి చికిత్స' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దీంతో శనివారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందించి ఘటనకు కారకులైన ఫార్మసిస్ట్ సునీత, స్టాఫ్ నర్స్ చంద్ర కళను సస్పెండ్ చేయడంతో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీ మాధవ్, ఫార్మ సిస్టులు శ్రీనివాస చారి, ఎం. విజయకుమార్, వెంకటేష్, కళ్యాణిలకు మెమోలు జారీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల ఆరోగ్యం తో చెలగాటం ఆడేలా నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహణ వైద్య సేవలను మెరుగుపరిచేందుకు అంతర్గత కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దాసండ్ల ప్రభాకర్


ఎస్సీల వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఉద్యమాలు : దాసండ్ల

ఉట్నూర్, ఆగస్టు 10: ఎస్సీల వర్గీకరణ కోసం ప్రభుత్వం నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసండ్ల ప్రభాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన మాల మహానాడు ముఖ్య నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఒక వర్గానికి న్యాయం చేకూరేలా ఉందన్నారు. వర్గీకరణ చేయడం సరైంది కాదని, వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. ఇందు కోసం ఉద్యమాలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు గాను మాల ఉప కులాలనుకలుపుకొని ఉట్నూర్ మండల మాలఉద్యమ కమిటీని ఎన్నుకున్నారు.

కాగా, మండలాధ్యక్షుడిగా సింగారే భారత్, తౌటు అశన్న ప్రధాన కార్యదర్శిగా, గొడిపెల్లి నర్సయ్య ఉపాధ్యక్షుడిగా, ముకుందరావ్ కోశాధికారిగా, రాజమణి అధికార ప్రతినిధిగా, యాటా గంగన్న కార్యదర్శిగా రాములుతో పాటు నాగరావ్ జాడే, కాటం రమేష్, బొంకంటి శుభాష్, ఆనంద్‌రావు, భారత్, శ్యాంసుందర్, యేసు, సుశీల్, బాలవంత్, వెంకటేశ్, రాములు, రాము, తదితరులు ఎన్నికైన వారిలో ఉన్నారు.

పల్లెల్లో జోరుగా బెల్ట్ దందా!

● ఏజెన్సీ గ్రామాల్లో బెల్ట్‌షాపుల్లో అధిక ధరలకు మద్యం అమ్మకాలు ● ఇతర వ్యాపార దుకాణాల్లోనూ అక్రమ దందా



నార్నూర్, ఆగస్టు 10: ఏజెన్సీ గిరిజన ప్రాంత గ్రామాలలో మద్యం దొరకని పల్లెలు మాత్రం ఒక్కటి లేనట్లుగా ఉంది. పల్లెల్లో బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతోంది. ఏజెన్సీలోని పల్లెలు, మారుమూల గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ దుకాణాలు వెలిశాయి. చిన్నచిన్న కిరాణా ఇతర వ్యాపార దుకాణాలు వద్ద నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. దీంతో స్థానిక మందుబాబులు బెల్ట్‌షాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగడంతో కుటుంబాలు వీధుల పాలవుతున్నాయి. నార్నూర్, గాదిగూడ మండల ప్రాంత అనేక గ్రామాల వద్ద బెల్ట్‌షాపుల్లో రోజుకు వేల రూపాలయపైనే ఆదాయం రావడం గమనార్హం. దీంతో పాటే గతంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి. పల్లెటూరు ప్రాంతాల దగ్గర పేరుకే చిన్న కిరాణదుకాణం, కానీ అమ్మేది మద్యం.. ఎక్కువ ధరకు వ్యాపారం చేస్తున్నారు. సొంత ఇళ్లలో పెద్ద ఫ్రిజ్‌లు పెట్టుకుని మరీ మద్యం విక్రయిస్తున్నారు. వైన్‌షాపుల యజమానులు ఆటోల ద్వారా మద్యాన్ని ఊరురా సరఫరా చేస్తున్నారు. తమకు కేటాయించిన గ్రామాలకు నిత్యం ఆటోల ద్వారా పేరు గల బ్రాండ్లను పంపించి సొమ్ము చేసుకుం టున్నారు. మద్యం మత్తులో ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రతీ గ్రామంలో బెల్ట్‌షాపుల ద్వారా మద్యం ఏరులై పా రుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రోగులతో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ఉట్నూర్, ఆగస్టు 10: మండలంలోని షాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాథోడ్ నరేందర్ అకస్మీకంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించిన అనంతరం రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం అంటు వ్యాధుల సీజన్ అయినందున ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు.అన్ని సబ్ సెంటర్లలో ఏఎన్ఎంలు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్య సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రతీ గ్రామంలో ఆశావర్కర్లతో కలిసి ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గర్భిణులు బాలింతలకు సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్‌కుమార్ ఉన్నారు.

నాగోబా ఆలయ హుండీ లెక్కింపు

ఇంద్రవెల్లి, ఆగస్టు 10: నాగుల పంచమి పూజల్లో భాగంగా నాగోబా ఆలయంలో నిర్వహించిన నాగుల పంచమి పూజ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన హుండీని శనివారం మెస్రం వంశీయులు లెక్కించారు. నాగోబా ఆలయ హుండి ద్వారా రూ.ఒక లక్షా 80 వేల 896 ఆదాయం రాగా తైబజార్ ద్వారా రూ. 28 వేల 60 రూపాయల ఆదాయం వచ్చిందని, మొత్తం రెండు లక్షల 8 వేల 995 రూపాయల ఆదాయం వచ్చినట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్ రావు, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారంలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయులు మెస్రం బాదిరావు, కోసేరావు, వంశం ఉద్యోగస్తులు దేవ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అంధ్ ఆదివాసీ గ్రామాల్లో శిరాల్ ఉత్సవాలు

ఇంద్రవెల్లి, ఆగస్టు 10: మండలంలో అంధ్ ఆదివాసి గ్రామాల్లో శ్రావణ మాసంలో నాగుల పంచమి మరుసటి రోజునిర్వహించే శిరాల్ ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరలో గుట్ట మట్టిని గ్రామ పెద్దఇంటికి తీసుకొచ్చి శిరాల్ దేవతలను తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. సంతానం లేని వారికి సంతానం ప్రాప్తి కలగాలని, ప్రజలు, పాడి పశువులు ఆరోగ్యంగా ఉండాలని, పంటలు బాగా పండాలని శిరాల్ దేవతకు మొక్కినట్లు అంధ్ ఆదివాసీ పెద్దలు తెలిపారు. అనంతరం శిరాల్ విగ్రహాలను గ్రామాల్లో ఊరేగిస్తూ మహిళలు చేసిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాత్రి ప్రత్యేక పూజలతో గ్రామ పొలిమేరలో గల వాగుల్లో వదిలి విడిది చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ముఖడే విష్ణు, ముఖడే ఉత్తం, గారుశే దశరథ్, బాలాజీ, తదితరులు ఉన్నారు.



శిరాల్ దేవతకు పూజలు చేస్తున్న అంధ్ ఆదివాసీ సమాజ్ మహిళలు

అర్లి(కె)లో కొనసాగుతున్న శబరిమాత అఖండ జ్యోతి

● అన్నదానం నిర్వహించిన కజ్జర్ల శబరిమాత భక్తులు

తలమడుగు, ఆగస్టు 10: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని అర్లి(కె) గ్రామంలో శబరిమాత భక్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమంలో శనివారం కజ్జర్ల గ్రామానికి చెందిన శబరిమాత భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో శ్రావణ మాసంలో అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. నెల రోజుల పాటు నిర్వహించే శబరిమాత అఖండజ్యోతి కార్యక్రమంలో జిల్లా నల్గొండ నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి కామారెడ్డి జిల్లా నుంచి శబరిమాత భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఈ కార్యక్రమంలో శబరిమాత నిర్వాహణ కమిటీ సభ్యులు బీఆర్ఎస్ పార్టీ అధకార ప్రతినిధి కిరణ్‌కుమార్, మాజీ మున్సిపల్ కమిషనర్ దేవారెడ్డి, శబరిమాత భక్తులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న కజ్జర్ల శబరిమాత భక్తులు

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 10: జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో శనివారం స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయాధికారులు, న్యాయవాదుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు హాజరై మాట్లాడారు. ఇందులో జిల్లా అదనపు న్యాయాధికారి శివరాం ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, న్యాయవాదులు, సిబ్బంది, గుమస్తాలు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ మృతి

భీంపూర్, ఆగస్టు 10: మండలంలోని నిపాని గ్రామానికి చెందిన సారజా(38) అనే మహిళ న భర్త రవి కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసై భార్య సారజాను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం వడ్డం శివారు పంట చేనులో ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహ్మద్ ఖలీం తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

తాంసి, ఆగస్టు 10: ప్రస్తుతం వర్షాకాలమైనందున పరిసరాల పరిశుభ్రతపై ప్రతీఒక్కరు దృష్టి పెట్టాలని మండల వైద్య బృందం ప్రజలకు సూచించారు. శనివారం తాంసి, అట్నంగూడ గ్రామాల్లో వైద్య బృందం పర్యటించింది. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. మురికినీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తులసీరామ్, లక్ష్మి, పద్మ, అరుణ, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో డ్రైవింగ్‌లో శిక్షణ

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 10: ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్ సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు హెవీ మోటార్ డ్రైవింగ్ నేర్చుకోవడానికి సెల్ నెం. 7382840349 కు లేదా ఆదిలాబాద్ డిపో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఫీజు రూ.15,600 ఉంటుందని, అభ్యర్థులు తప్పనిసరిగా లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాచ్ నెంబర్ కలిగి ఉండాలని డిపో మేనేజర్ పేర్కొన్నారు.

దోపిడీ ముఠా అరెస్టు



నిర్మల్ కల్చరల్, ఆగస్టు 10 : నిర్మల్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో దోపిడీకి పాల్పడుతున్న ముఠాను శనివారం అరెస్ట్ చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. తోకల విఠల్ మనుమడిని ఆసుపత్రిలో చూపించేందుకు బస్టాండ్ నుంచి బయటకు వస్తుండగా అతనిని రాపని శ్రీను, వేముల సుజాత, రాజమణిలు అడ్డగించి 6 గ్రాముల బంగారు గొలుసుతో పాటు జేబులో నుంచి 950 రూపాయలు, సెల్‌ఫోన్ దోచుకొని పారిపోయారన్నారు. బాధితుడు విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని తెలిపారు. డీఎస్పీ గంగారెడ్డి ఆదేశాలతో సీఐ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో దోపిడీకి పాల్పడ్డ ఇద్దరు దొంగలను బస్టాండ్ ప్రాంతంలో అరెస్ట్ చేసి వారి నుండి 950 నగదు, మొబైల్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఎడారి దేశంలో కార్మికుడికి తప్పని అవస్థలు

● స్వదేశానికి రప్పించాలని వేడుకోలు ● నిర్మల్ వాసి ఆడు జీవితం
● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన కలెక్టర్ ● కన్నీరుమున్నీరు అవుతున్న కుటుంబ సభ్యులు



రోదిస్తున్న బాధితుడు



బాధితుడి కుటుంబ సభ్యులు

ముథోల్, ఆగస్టు 10 : కుటుంబ పోషణకై ఉన్న ఊరు కన్న తల్లిదండ్రులను, భార్య పిల్లలను విడిచి దేశం కాని దేశం అయిన ఎడారి దేశంలో పని చేయడానికి వెళ్లి పడరాని పాట్లు పడుతున్నాడు. అక్కడి యజమాని వేధింపులు ఎక్కువ కావడంతో తనను ఆదుకోవాలని బాధితుడి గోడు వర్ణనాతీతం. అతనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో ఆంధ్రజ్యోతి శనివారం 'నిర్మల్ వాసి ఆడు జీవితం' అనే శీర్షికతో మెయిన్ పేజీలో కథనం ప్రచురితమైంది. కథనానికి నిర్మల్ జిల్లా కలెక్టర్ స్పందించారు. ముథోల్ మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్ గత పది నెలల క్రితం కుటుంబ పోషణకు అలాగే చేసిన అప్పులను తీర్చడానికి కువైట్ దేశానికి ఉపాధి కోసం వెళ్లాడు. ఎడారి దేశానికి పంపిన సదరు ఏజెంట్ అక్కడ క్లీనింగ్ పనులు చేయడానికి అని చెప్పి నమ్మించాడు. కానీ అక్కడ ఎడారిలో ఒంటెలను మేపడానికి పంపిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. నెలల పాటు పట్టణాలకు దూరంగా ఉంటూ ఎండను తట్టుకోలేక పలుమార్లు అనారోగ్యానికి గురయ్యానని తన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపాడు. ఒక పని కోసం అని చెప్పి తీసుకెళ్లి మరో పని చేయిస్తూ యజమాని తనను వేధింపులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పది నెలల నుండి వేధింపులు భరించలేక అనారోగ్యానికి గురైన కనీసం ప్రథమ చికిత్సను సైతం అందించడం లేదని కుటుంబ సభ్యులకు తెలిపి కన్నీటి పర్యంతమయ్యాడు. పడరాని పాట్లు పడుతున్న తనను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు స్థాని శాసన సభ్యులు రామారావు పటేల్ ఆదుకొని స్వదేశానికి రప్పించే విధంగా చూడాలని వీడియో ద్వారా వేడుకుంటున్నాడు. తన భర్త ఎడారి దేశంలో పడరాని పాట్లు పడుతూ ఇబ్బందులకు గురవుతున్నాడని తెలిపారు. కుటుంబ పెద్ద లేని లోటు తమను మానసికంగా వేధిస్తుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి తాము పడుతున్న బాధను అర్థం చేసుకొని తన భర్తను స్వదేశానికి రప్పించే విధంగా సహాయం చేయాలని బాధితుడి భార్య హరిలక్ష్మి వేడుకోవడంతో ఎడారి దేశంలో నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్ పరిస్థితిని ఆంధ్రజ్యోతి 'నిర్మల్ వాసి ఆడు జీవితం' అనే శీర్షికతో కథనం ప్రచురించడంతో అధికార యంత్రాంగం స్పందించింది. ముథోల్ ఎమ్మెల్యే బాధిత కుటుంబంతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు, నాయకులతో మాట్లాడారు. బాధితుడి కుటుంబ సభ్యులకు అధైర్య పడవద్దని రాథోడ్ నాందేవ్‌ను స్వదేశానికి రప్పించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడామని తెలిపారు. అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో మాట్లాడామని పేర్కొన్నారు.

స్పందించిన జిల్లా కలెక్టర్

జిల్లాకు చెందిన గల్ఫ్ బాధితుడిని రక్షించేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. కువైట్ దేశంలోని ఎడారిలో ఒంటెలు కాస్తున్న ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన నాందేవ్ గత కొన్ని రోజులుగా ఎడారిలో కఠిన పరిస్థితుల మధ్య ఇబ్బందులు పడుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వీడియోను పోస్ట్ చేశాడు. దీనిపై స్పందించిన జిల్లా యంత్రాంగం రియాద్, కువైట్ రాయబార కార్యాలయాన్ని సంప్రదించింది. ప్రస్తుతం అతను క్షేమంగా ఉన్నాడని, అతనిని తిరిగి రప్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు.

డిటెక్టివ్ పోలీసు అధికారిని సస్పెండ్ చేయాలి : బీఎస్పీ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 10 : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న డిటెక్టివ్ అధికారి రాంరెడ్డిని సస్పెండ్ చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి డి. జగన్మోహన్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. దొంగతనం నేరంపై ఓ మహిళపై విచక్షణ రహితంగా లాఠీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబానికి 14 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదుకు డిమాండ్ చేశారు. కోమలి, రాధ, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఆధారంగా ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 10 : ఉపాధ్యాయులకు అవార్డులను ప్రతిభ ఆధారంగా ఇవ్వాలని, దరఖాస్తు ప్రక్రియ జరపరాదని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు రాజేష్ నాయక్ విడుదల చేసిన ప్రకటనలో ప్రతి సెప్టెంబరు 5న ఉపాధ్యాయులకు ఇచ్చే అవార్డులకు ఒక కమిటీ ఏర్పాటు చేయాలని రహస్యంగా పనితీరు తెలుసుకోవాలన్నారు.

గాజులపేట్‌లో ఉచిత వైద్య శిబిరం

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 10 : గాజులపేట్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఫాతిమా 146 మందికి కీళ్లనొప్పులు, మధుమేహం, రక్తపోటు, తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కౌన్సిలర్ ఇమ్రానుల్లా, నాయకులు హబీబ్, రెహాన్ ఉల్లా, జమాల్ అహ్మద్, అర్బాజ్, వైద్య సిబ్బంది రహీం, శ్రావణ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలను అతిక్రమించి వైద్యం అందిస్తే కేసులు తప్పవు'

ముథోల్, ఆగస్టు 10 : మండల కేంద్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీ నిర్వహించే వైద్యులు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, నిబంధనలను అతిక్రమించి వైద్యం అందిస్తే కేసులు తప్పవని ముథోల్ సీఐ మల్లేష్ అన్నారు. శనివారం ముథోల్ సర్కిల్ కార్యాలయంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. రోగులకు వారి వారి గ్రామాల్లో ప్రాథమిక చికిత్స నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో ప్రాథమిక వైద్యం పేరుతో డాక్టర్ బోర్డులు పెడుతూ ఎటువంటి అర్హత లేకుండా వైద్యం నిర్వహించడంపై పలు సూచనలు, సలహాలు వారికి ఇచ్చారు. లింగ నిర్ధారణ, మైనర్, మేజర్ మహిళలకు అబార్షన్ వైద్యం చేయడం నేరమని తెలిపారు. మోతాదుకు మించి ఇంజక్షన్లు, మందులు వాడరాదని రోగులకు ఇవ్వరాదని, ఇచ్చి వారి ప్రాణాల మీదకు తేవడం నేరమని పేర్కొన్నారు. రోగులకు ఇతర జిల్లాలోని ఎంబీబీఎస్ డాక్టర్లకు రెఫర్ లెటర్లతో వారికి ఇవ్వకూడదని, లెటర్లు కానీ ప్రత్యక్షంగా రోగులను వేరే ఆసుపత్రికి తీసుకవెళ్లి బాధితుల నుండి పరోక్షంగా కమిషన్లు తీసుకుంటున్నట్లు మా దృష్టికి వచ్చిందని తెలిపారు. రోగులు ఇష్టం వచ్చిన దగ్గర అనుమతి కలిగిన వైద్యుల వద్ద వారు వైద్యం పొందాలను కోరారు. నిబంధనలు పాటించని ఆర్ఎంపీ, పీఎంపీలపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. కాలం చెల్లిన మందులు ఎట్టి పరిస్థితుల్లో వాడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయికిరణ్, పోలీసుసిబ్బంది, ఆర్ఎంపీ, పీఎంపీలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం పైనే ఆశలు





- సమస్యల సుడిగుండంలో బీడీ కార్మికులు
- హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి వేడుకోలు
- లేని పక్షంలో ఆందోళనకు సిద్ధమవుతున్న బీడీ కార్మికులు
- జిల్లాలో లక్ష మంది బీడీ కార్మికులు

నిర్మల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికులు సమస్యల సుడిగుండంలో కొట్టు మిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంపైనే వారు గంపెడాశలు పెట్టుకున్నారు. జిల్లాలో దాదాపు లక్ష వరకు బీడీ కార్మికులు, టేకేదార్లు, ప్యాకర్లులతో పాటు తదితరులు ఉంటారని చెబుతున్నారు. ఇంత పెద్దసంఖ్యలో ఉన్న బీడీ కార్మికులను ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా.. పట్టించుకోకపోవడం పట్ల వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీడీ యాజమాన్యాలు కార్మికులకు నెల రోజులకు తగిన విధంగా పనిఇవ్వకుండా వేధిస్తుండడంతో.. ఇప్పటికే తమ ఉపాధి ప్రశ్నార్థకమవుతోందని వాపోతున్నారు. బీడీలు చుట్టే కార్మికులందరికీ ప్రతీ నెలకు గాను 28రోజుల పాటు పని కల్పించాలని వారు కోరుతున్నారు. కాగా.. వెయ్యి బీడీలకు సరిపడే తూనికాకు ఇవ్వకపోవడం.. అలాగే పొగాకు సైతం ఇవ్వకపోవడంతో కార్మికులు ఇతరుల నుంచి నాణ్యమైన తూనికాకును కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. ముఖ్యంగా మహిళా బీడీ కార్మికులకు కార్మికచట్టంలోని ఏ ఒక్క హక్కు కూడా దక్కడం లేదని, ప్రసూతీ సమయంలో వారికి ఎలాంటి అదనపు సౌకర్యం కల్పించడం లేదని బీడీ కార్మికులు ఆరోపిస్తున్నారు. యాజమాన్యాల దోపిడీ విధానంతో పాటు నియంతృత్వ పోకడలతో బీడీ కార్మికులు అన్ని రకాలుగా నష్టపోతున్నారంటున్నారు. యాజమాన్యాలు పథకం ప్రకారం పరిశ్రమలను మూసివేస్తామంటూ పరోక్ష హెచ్చరికలు చేసి బీడీ కార్మికుల్లో ఉపాధిపై ఆందోళనలు కలిగిస్తున్నారని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో వివిధ బీడీ కార్మిక సంఘాలు కార్మికులకు అండగా ఉండేందుకు సిద్ధమై ఇక ఉద్యమ బాట పట్టేందుకు నడుం బిగిస్తున్నాయి. ఇటీవలే జిల్లా కలెక్టరేట్‌ను దాదాపు 2వేల మందికి పైగా బీడీ కార్మికులు ముట్టడించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఇక మండల, గ్రామస్థాయిలో బీడీ కార్మికులు వరుసగా ఆందోళనలు చేపట్టేందుకు సైతం సిద్ధమవుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని రాగానే బీడీ కార్మికులంతా ఆయనను కలిసి తమకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరనున్నట్లు కార్మిక సంఘాల ప్రతినిధులు వెల్లడిస్తున్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు (ఫైల్)

ఓటు బ్యాంకుగా బీడీ కార్మికులు..

గత దశాబ్దాల నుంచి బీడీ కార్మికులు అన్ని ప్రధాన రాజకీయ పార్టీల నేతలకు ఓటు బ్యాంకుగా మారారు. ఎన్నికల సమయంలో వారిని ప్రసన్నం చేసుకునేందుకు పోటీ చేసే అభ్యర్థులంతా తీవ్రప్రయత్నాలు చేస్తుంటారన్నది బహిరంగ రహస్యమే. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో వారు గెలుపోటములను శాసించే స్థాయిలో ఉన్నారు. వారి ఓట్లను మెజార్టీగా దక్కించుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు హామీల వర్షం కురిపిస్తుండడం సహజంగా మారింది. అమాయకులైన బీడీ కార్మికులు ఈ హామీలకు ఆకర్షితులై తమ మద్దతును అందిస్తున్నారు. అయితే ఎన్నికల్లో గెలిచిన నేతలు ఆ తరువాత బీడీ కార్మికుల వైపు కన్నెత్తి చూసేందుకు కూడా సాహసించడం లేదంటున్నారు. తమ సమస్యలపై నిలదీసే కార్మికులపై వారు కక్ష సాధింపు చర్యలకు సైతం పాల్పడుతున్నారని అంటున్నారు.

లక్ష మంది ఉపాధిపై ప్రభావం

బీడీ యాజమాన్యాలు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో లక్ష మంది బీడీ కార్మికుల ఉపాధిపై ప్రభావం పడనున్నట్లు పేర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీడీ పరిశ్రమను కాపాడేందుకు ఆశించిన మేర చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం బీడీ కార్మికులను ఆదుకుంటామని హామీ ఇవ్వడమే కాకుండా వారి సంక్షేమానికి పలు సంక్షేమాలకు కూడా ప్రకటించింది. ఈ హామీలపైనే వారంతా ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలోని దాదాపు లక్ష మందికి పైగా బీడీ కార్మికులు ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయంతో పాటు దాని సమానంగా కూడా బీడీ పరిశ్రమలో కార్మికులు పని చేస్తున్నారు. ముఖ్యంగా మహిళ కార్మికులు బీడీ పరిశ్రమనే నమ్ముకొని జీవనం గడుపుతున్నారు. లక్ష కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న బీడీ పరిశ్రమను కాపాడుకునేందుకు ఇప్పటి వరకు ప్రభుత్వాలు సైతం స్పష్టమైన చర్యలు చేపట్టలేదన్న విమర్శలున్నాయి. బీడీ కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారే తప్పా.. వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం ఇప్పటి వరకు లభించడం లేదంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపైనే వారంతా ఆశలు పెట్టుకుంటున్నారు.

కార్మికుల సమస్యలు ఇవీ..

కాగా బీడీ కార్మికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం యాజమాన్యాలతో చర్చించి తమకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చాలని అంటున్నారు. వెయ్యి బీడీలకు రూ. 400 వేతనాన్ని అందించాలని అలాగే బీడీ ప్యాకర్లకు ప్రస్తుతం ఉన్న వేతనంపై 50శాతం పెంచాలంటున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరువు భత్యాన్ని పాయింట్‌కు 10 పైసల నుంచి 30 పైసల వరకు పెంచాలని అంటున్నారు. బీడీ కట్టపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఆరోగ్య హెచ్చరిక బొమ్మ 85శాతం నుంచి పది శాతానికి తగ్గించాలని అంటున్నారు. అలాగే బీడీ కార్మికులందరికి రూ. 4వేల పెన్షన్ అందించాలని, ప్రసూతి సెలవులు కల్పించాలని అంటున్నారు. గ్రాట్యూటీ చెల్లింపును కూడా రెట్టింపు చేయాలని, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆలయాల్లో శ్రావణసందడి



సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు

కుంటాల, ఆగస్టు, 10 : కుంటాల మండలంలోని ఓలా, సూర్యాపూర్, కుంటాల శివాలయాలు శ్రావణ శనివారం పురస్కరించుకొని భక్తులతో కిటకిటలాడాయి. సూర్యాపూర్ శివాలయంలో శనివారం ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించారు. రైతులకు పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దేవున్ని మనసారా కోరుకున్నట్లు ఆయన తెలిపారు. సూర్యాపూర్ శివాలయంలో డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేష్ అన్నదాన కార్యక్రమం నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డితో పాటు తూర్పాటి వెంకటేష్ దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అభినందించి సన్మానించారు.

ఈవ్ టీజింగ్ చేసే వారిపై కఠిన చర్యలు : ఎస్పీ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 10 : జిల్లాలో ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిని ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకొని రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఎస్పీ జానకి షర్మిల్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో, అసహ్యకరమైన లేదా ప్రతికూల వ్యాఖ్యలు మహిళలకు పంపిన, లైగింక వేధింపులకు గురిచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో క్షమించబోమన్నారు. వారిపై చట్ట రీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కళాశాలలు, పాఠశాలలు, షాపింగ్ మాల్స్ మహిళలు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో నిర్మల్ పోలీసు సిబ్బంది, షీ టీమ్ బృందాలు మఫ్టీలో తిరుగుతుంటారని ఈవ్ టీజర్లను హెచ్చరించారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తుల రాక

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 10 : హైకోర్టు న్యాయమూర్తులు టి.వినోద్‌కుమార్, కే.లక్ష్మణ్ ఆదివారం నిర్మల్ రానున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 9:30 గంటలకు నిర్మల్ చేరుకుంటారని తెలిపారు. 10 గంటలకు నిర్మల్ నుంచి బోథ్ బయలుదేరి అక్కడ నిర్మించనున్న కోర్టు భవనానికి, రెసిడెన్షియల్ క్వార్టర్స్‌కు శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుండి మధ్యాహ్నం హైదరాబాద్ బయలుదేరి వెళ్లనున్నట్లు తెలిపారు.

వైద్యాధికారుల నియామకానికి 20న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 10 : నిర్మల్ మెడికల్ కళాశాలలో 57 వైద్యాధికారుల నియామకానికి ఈ నెల 20న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2 సీఏఎస్, 6 ప్రొఫెసర్, 14 అసోసియేట్, 18 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 17 సీనియర్ రెసిడెంట్స్ గౌరవ వేతనంపై నియామకం చేయనున్నట్లు తెలిపారు.

అద్దెకు ఆర్టీసీ బస్సులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 10 : శ్రావణమాసం పెళ్లిళ్ల సందర్భంగా ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ముందస్తు డిపాజిట్ లేకుండానే ప్రయాణించే దూరాన్ని బట్టి చార్జీలు వసూలు చేస్తామన్నారు. ఈ సౌకర్యం సెప్టెంబరు 6 వరకు పెళ్లి బస్సు బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ ఉంటుందన్నారు. శుభకార్యాలు, విహారయాత్రలకు ఆర్టీసీ అద్దె బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశం వినియోగించుకోవాలని సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వివరాలకు 9492767879, 7382842582 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఒంటరి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య



రాకేష్ (ఫైల్)

ఖానాపూర్, ఆగస్టు 10 : నాలుగేళ్ల క్రితం అమ్మ నాన్నలు చనిపోగా... రెండేళ్ల క్రితం అతని అన్న చనిపోయాడు. రెండేళ్లుగా ఒంటరి జీవితాన్ని అనుభవించిన ఆ యువకుడు ఎవరూ లేని జీవితంపై విరక్తి చెందాడు. ఇక తన తనువు చాలించాలని భావించి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ హృదయ విదారకమైన ఘటన మండలంలోని మాసాయిపేట్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... కడెం పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... మాసాయిపేట్ గ్రామానికి చెందిన గొట్టం రాకేష్(21) అనే యువకుడి అమ్మ నానన్నలు నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వారు చనిపోయిన రెండేళ్లకు రాకేష్ సోదరుడు కూడా అనారోగ్యం బారిన పడి మృతి చెందాడు. దీంతో తమ కుటుంబంలో రాకేష్ మాత్రమే ఒంటరిగా మిగిలిపోయాడు. కాగా తన ఒంటరితనాన్ని భరించలేక జీవితంపై విరక్తి చెందిన రాకేష్ గత నెల 31వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన బంధువులు రాకేష్‌ను నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించగా ఆరోగ్యం కుదుటపడి ఇటీవల ఇంటికి వచ్చాడు. కాగా రాకేష్ శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వెంటనే బంధువులు నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం రాకేష్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై భీమ్‌రావు తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు.. ఒకరికి తీవ్రగాయాలు

దిలావర్‌పూర్, ఆగస్టు 10 : మండలంలోని న్యూ లోలం గ్రామం వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముథోల్‌కు చెందిన సాయినాథ్ నిర్మల్‌లో కిరాణా సామగ్రి కొనుగోలు చేసి ఆటోలో ముథోల్ తీసుకెళ్తుండగా న్యూ లోలం వద్దకు రాగానే భైంసా పట్టణానికి చెందిన సలీం తన కారును నిర్లక్ష్యంగా నడుపుతూ వేగంగా ఆటోను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో ఆటో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ వినోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. సాయినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్వర్ గౌడ్ తెలిపారు.

ఆలయంలో చోరీకి పాల్పడ్డ నిందితుల అరెస్టు



దొంగతనానికి పాల్పడిన వారిని పట్టుకున్న పోలీసులు

కుభీర్, ఆగస్టు, 10: మండల కేంద్రం కుభీర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీకి పాల్పడ్డ ఇద్దరిని పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి ఆలయంలో చొరబడిన వీరు రూ. 4 వేల విలువ గల గుడి గంట, గ్యాస్ సిలిండర్‌ను చోరీ చేశారు. కాగా ఉదయం గంటను బైక్‌పై తీసుకెళుతుండగా మండలంలోని చొండి గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బసవన్నకు అంత్యక్రియలు



బసవన్నకు అంత్యక్రియలు చేస్తున్న దృశ్యం

సారంగాపూర్ రూరల్, ఆగస్టు 10 : మండలంలోని ధని గ్రామ సమీపంలో గల రాజరాజేశ్వర ఆలయానికి 14 సంవత్సరాల క్రితం శివభక్తుడు బసవన్నను కానుకగా ఇచ్చాడు. బసవన్న శనివారం అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామస్థులు మృతి చెందిన బసవన్నను ఆలయం నుంచి డప్పు మేళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్య క్రియలు చేశారు.

పశువుల సమస్య పరిష్కారానికి ఖానాపూర్ మున్సిపల్ వినూత్నయత్నం

- రోడ్డుపై తిరిగే పశువులన్నీ జూనియర్ కళాశాల ప్రాంగణానికి తరలింపు
- రూ. 1000 జరిమానా చెల్లించి 13 పశువులను విడిపించుకు వెళ్లిన యజమానులు
- నేడు స్పందించకపోతే గోశాలకు తరలిస్తాం
- మున్సిపల్ చైర్మన్ సత్యం



మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్, ఆగస్టు 10 : ఖానాపూర్‌లో ఏళ్ల తరబడిగా రోడ్లపై సంచరిస్తూ పట్టణ ప్రజలతో పాటు వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న పశువుల సమస్యకు చెక్ పెట్టేందుకు ఖానాపూర్ మున్సిపల్ పాలకవర్గం వినూత్న యత్నానికి శ్రీకారం చుట్టింది. శనివారం తెల్లవారు జామున కార్యాలయాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం మున్సిపల్ కార్మికుల హాజరు పట్టికను పరిశీలించిన అనంతరం పశువుల సమస్యలకు పరిష్కారం కోసం ఒక ప్రకటన చేశారు. రోడ్డుపై సంచరిస్తున్న పశువులన్నింటినీ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తరలించిన పశువులన్నింటినీ విడిపించుకుపోయేందుకు ఆదివారం సాయంత్రం వరకు యజమానులకు అవకాశం ఇచ్చారు. తమ పశువులను ఇకపై రోడ్డుపై తిరగనియ్యమని పది రూపాయల బాండ్‌పేపర్‌పై హామీ పత్రం రాసిచ్చి ఇప్పటి వరకు రోడ్డుపై పశువులను వదిలేసినందుకు రూ. 1000 జరిమానా కట్టి యజమానులు వారి వారి పశువులను విడిపించుకు వెళ్లేలా అవకాశం కల్పిస్తున్నట్లు చైర్మన్ సత్యం తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకు పశువుల యజమానులు వాటిని తీసుకుపోకపోతే సోమవారం నాడు వేలంపాట నిర్వహిస్తామన్నారు. వేలంపాటకు సైతం ఆశించిన స్పందన రాకుంటే పశువులను గోశాలకు తరలించేందుకు ఇదివరకే ఇతర జిల్లాలోని గోశాలల నిర్వాహకులతో మాట్లాడినట్లు ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ పాలకవర్గం తీసుకున్న ఈ నిర్ణయానికి పశువుల యజమానుల నుండి స్పందన వస్తోంది. శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు మొత్తం 40 పశువులను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణానికి తరలించినట్లు చైర్మన్ సత్యం తెలిపారు. ఈ 40 పశువులలో 13 పశువులను ఇకపై రోడ్డుపై తిరగనివ్వమని వాటి యజమానులు హామీ పత్రం రాసిచ్చి రూ. 1000 జరిమానా చెల్లించి విడిపించుకు వెళ్లినట్లు పేర్కొన్నారు. మిగతా వారు కూడా ముందుకు వచ్చి తమ తమ పశువులను తీసుకెళ్లి మరోసారి రోడ్డుపైకి వదలకుండా జాగ్రత్తగా చూసుకోవాలని చైర్మన్ సత్యం సూచించారు. లేని పక్షంలో పట్టణంలో రోడ్లపై సంచరించే పశువులన్నింటినీ గోశాలలకు తరలిస్తామని స్పష్టం చేశారు. పట్టణ రోడ్లపై సంచరిస్తూ వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తూ అవి అవస్థలు పడుతున్న పశువుల సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ పాలకవర్గం తీసుకున్న వినూత్న నిర్ణయాన్ని సోషల్ మీడియా వేదికగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్‌తో పాటు పలువురు మున్సిపల్ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణానికి తరలించిన పశువులు

ఘనంగా జస్టిస్ పి. శివశంకర్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 10 : జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు ఉద్యోగ, విశ్రాంత సంక్షేమ సంఘ సభ్యులు శనివారం జస్టిస్ పి.శివశంకర్ 95వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆయనకు భారతరత్న అవార్డు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. పోస్టర్ స్టాంప్ విడుదల చేయాలని, పార్లమెంట్‌లో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి గౌరవించాలన్నారు. ఉద్యోగ సంఘ అధ్యక్షుడు ఏ. గంగాధర్, విశ్రాంత ఉద్యోగ సంఘ అధ్యక్షుడు ఎంసీ లింగన్న, సృజన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్ : ముథోల్ నియోజకవర్గ కేంద్రంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు రోళ్ళ రమేష్ ముథోల్ బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం శివశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం తాలూకా అధ్యక్షుడు రోళ్ళ రమేష్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల ప్రదాత పుంజాల శివశంకర్ సార్ అని పేర్కొన్నారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని చదివి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఎన్నో సేవలు అందించారు. ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొని రెండుసార్లు ఎంపీగా గెలిసి రెండుసార్లు కేంద్ర మంత్రివర్యులుగా పదవి బాధ్యతలు చేపట్టి బీసీ రిజర్వేషన్ల కొరకు ఎంతో కృషి చేసి రిజర్వేషన్‌లను సాధించిన ఘనులు శివశంకర్ సార్ అని అన్నారు. మనమందరం వారి అడుగుజాడల్లో నడుస్తూ, వారి ఆశయాలను కొనసాగిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రమేష్, మాజీ కార్యదర్శి బి. సుదర్శన్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, గ్రామ బీసీ సంఘం అధ్యక్షుడు గుంజాల నారాయణ, కోశాధికారి మేత్రి సాయినాథ్, నాగేష్, డాక్టర్ నర్సయ్య, డాక్టర్ భాస్కరోల్ల శేఖర్, నాయకులు ధర్మపురి శ్రీనివాస్, నిశికాంత్, శంకర్, రేకులపెల్లి రాజన్న, తదితరులున్నారు.



ముథోల్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా అన్నబావు సాటే జయంతి

కుంటాల, ఆగస్టు, 10: మండలంలోని లింబా (కే) గ్రామంలో శనివారం అన్నబావు సాటే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసిన పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.

సంక్షిప్త సమాచారం

జిల్లాలో వర్షం సమాచారం

నిర్మల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షపాతం 0.4 మిల్లీమీటర్లు కాగా, అత్యధికంగా ముథోల్ మండలంలో 3.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన కడెం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 7.603 కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 7.070 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 2323 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. అలాగే స్వర్ణ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.484 టీఎంసీలుగా ప్రస్తుత నీటినిల్వ సామర్థ్యం 1.405 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా 230 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. గడ్డెన్న వాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.852 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 1.084 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 100 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది.

రేపు సీపీఐ సమావేశం

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 10 : సోమవారం సీపీఐ నిర్మాణాత్మక సమావేశం స్థానిక పెన్షనర్ల సంఘ భవనంలో నిర్వహిస్తున్నామని జిల్లా కార్యదర్శి విలాష్ తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి సలుపాలన్నారు. రాబోయే రోజుల్లో కమ్యూనిస్టుల పాత్ర కీలకంగా మారనుందన్నారు. పార్టీ సభ్యత్వ సేకరణ చేయాలని, సమావేశం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకుడు ఎస్ఎన్ రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేష్, ఏఎస్ఎఫ్ కన్వీనర్ కైలాస్, అనంతరావు, రమేష్ పాల్గొన్నారు.

వినేష్ ఫోగట్‌కు న్యాయం చేయాలి

ఒలంపిక్ క్రీడల్లో వినేష్ ఫోగట్‌కు న్యాయం చేయాలని జిల్లా టైక్వండో అసోసియేషన్ డిమాండ్ చేసింది. అధ్యక్షుడు ధ్యాయత్ సోమేష్, అక్షయ్ తదితరులు మాట్లాడుతూ... అనర్హత ప్రకటించడం సరైన నిర్ణయం కాదని విమర్శించారు.